# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-07-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **పార్లమెంటు వర్షాకాల సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ రోజు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది.**

**2.** **రాష్ట్రంలోని ప్రతి నగరం డిజిటల్ గ్రోత్ ఇంజన్‌గా ఎదగాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు.**

**3.** **ఆషాఢ మాసం సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గ అమ్మవారికి సారె సమర్పించేందుకు భక్తులు భారీగా తరలి వస్తున్నారు.**

**4.** **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారం కానుంది.**

==========================

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ రోజు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో పార్లమెంటు ఉభయ సభలు సజావుగా సాగేలా సహకరించాలని ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలను కోరింది. రేపటి నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకు ఈ సమావేశాలు జరుగుతాయి. ఈ సందర్భంగా కిరణ్ రిజుజు పాత్రికేయులతో మాట్లాడుతూ, పార్లమెంటులో లేవనెత్తాల్సిన ముఖ్యమైన అంశాలపై చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

-------------------------

రాష్ట్రంలోని ప్రతి నగరం డిజిటల్ గ్రోత్ ఇంజన్‌గా ఎదగాలని కోరుకుంటున్నామని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ సంస్థ కృష్ణా జిల్లా గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో యువతకు ఉద్యోగాల కల్పనే తమ ప్రధాన ధ్యేయమని తెలిపారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చామని.. ఇప్పటికే 10 లక్షల ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు కుదుర్చుకున్నామని మంత్రి వివరిస్తూ...

.. వాయిస్ ..30 సెకన్లు

---------------------------

ఆషాఢ మాసం సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ కొనసాగుతోంది. జగన్మాతను ఆడపడచుగా భావించి సారె సమర్పించేందుకు భక్తులు భారీగా తరలి వస్తున్నారు. రద్దీ నేపథ్యంలో కనకదుర్గ అమ్మవారిని అందరూ దర్శించుకునేలా అన్ని దర్శనం టికెట్ కౌంటర్స్ మూసి వేసి.. ఉచిత దర్శనానికి మాత్రమే అనుమతిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె.శీనానాయక్ తెలిపారు. అందరికీ అమ్మవారి దర్శనం కల్పించేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన వివరించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 124వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

తిరుపతి నగర ప్రజల తరపున స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారం అందుకునే అవకాశం దక్కడం గర్వంగా ఉందని తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష తెలిపారు. తిరుపతిలో ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా స్వీకరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఈ ప్రోత్సాహంతో మరింత పట్టుదలతో తిరుపతి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తామని మేయర్ శిరీష తెలియజేస్తూ...

.. వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు లక్షా 56 వేల 516 క్యూసెక్కుల నీరు చేరుతోంది. జలాశయం నుంచి 87 వేల 525 క్యూసెక్కులు దిగువకు విడుదలవుతోంది.. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 20 వేల క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35 వేల 315 క్యూసెక్కులు.. కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 32 వేల 210 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882.50 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 201.58 టీఎంసీలుగా ఉంది.

---------------------------

రేడియో ఆవిష్కర్త గుగ్లిఎల్మో మార్కోనీ వర్ధంతి ఈ రోజు. 1874 ఏప్రిల్ 25వ తేదీన ఇటలీలోని బోలొగ్నాలో జన్మించిన ఆయన, సుదూర ప్రాంతాలకు రేడియో ప్రసారాలు పంపడంలో, రేడియో టెలిగ్రాఫ్ వ్యవస్థను అభివృద్ధి చేయడంలో పితామహులుగా గుర్తింపు పొందారు. ఇతర భౌతిక శాస్త్రవేత్తల ప్రయోగాలను ఆధారంగా చేసుకొని మార్కోనీ రేడియో ను ఆవిష్కరించారు. 1909లో కార్ల్ ఫెర్డినాండ్ బ్రాన్తో కలిసి వైర్లెస్ టెలిగ్రఫీ అనే అంశంపై భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్న ఆయన 1937 జూలై 20వ తేదీన కన్నుమూశారు.

---------------------------

మిడ్ కేరీర్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్రం నుంచి ఎనిమిది మంది సీనియర్ ఐఏఎస్ అధికారులు ముస్సోరి వెళ్లారు. ఈరోజు నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు వారు లాల్‌బహుదూర్ శాస్త్రి అకాడమీలో శిక్షణ తీసుకోనున్నారు. కృష్ణా, అనంతపురం జిల్లాల కలెక్టర్ల స్థానంలో ఆయా జిల్లాల జాయింట్ కలెక్టర్లు ఇన్‌చార్జి కలెక్టర్లుగా బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.కే.మీనా నిన్న ఉత్తర్వులు జారీ చేశారు.

---------------------------

పశ్చిమ మధ్య, దాని ఆనుకొని ఉన్న దక్షిణ కోస్తా, ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ మీదుగా ఉపరితల ఆవర్తనం నెలకొని ఉందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని కోస్తా జిల్లాల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు అనేక చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది. రాష్ట్రంలోని వాతావరణ పరిస్థితుల గురించి వాతావరణ శాఖ అధికారి జి.లక్ష్మి తెలియజేస్తూ...

వాయిస్ 20 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచిన అన్నదాత-సుఖీభవ పథకం లబ్ధిదారుల జాబితాలో పేరు లేకపోతే.. ఈ నెల 23వ తేదీలోపు అర్హులైన రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద గ్రీవెన్స్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చని వ్యవసాయశాఖ సంచాలకులు డిల్లీరావు  సూచించారు. అన్నదాత-సుఖీభవ పథకంలో తమ అర్హత స్థితిని రుసుము రహిత నంబరు 155251 ద్వారా  రైతులు తెలుసుకోవచ్చని చెప్పారు. మన మిత్ర వాట్సాప్ నంబరు 95523 00009కి తమ ఆధార్ నంబరును పంపి కూడా రైతు అర్హత వివరాలు తెలుసుకోవచ్చని డిల్లీరావు  పేర్కొన్నారు.

---------------------------

తలసేమియా సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు అండగా ఉండేందుకే తలసేమియా అవగాహన పరుగు నిర్వహించామని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాఖపట్నం ఆర్కే బీచ్ రోడ్‌లో నిన్న నిర్వహించిన తలసేమియా పరుగును మాజీ వెయిట్ లిఫ్టర్ కరణం మల్లీశ్వరి, ప్రముఖ సంగీత దర్శకులు ఎస్.ఎస్.తమన్‌తో కలిసి ఆమె  ప్రారంభించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ తలసేమియా బాధపడుతున్న చిన్నారులకు బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ చేయించడంతోపాటు ఫిల్టర్స్, ఆరు వేల రూపాయల విలువజేసే మందులు అందిస్తున్నామని వెల్లడించారు.

=====================